సాక్షి నంద్యాల

సోమవారం, 6, ఫిబ్రవరి, 2023



భ్రామరీకి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి, మేళ తాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



ఆళ్లగడ్డలో అహోబిలేశుడు

ఆళ్లగడ్డ: పట్టణంలో అహోబిలేశుడి పార్వేట ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉత్సవ పల్లకీలో కొలువైన శ్రీ జ్వాలా నారసింహ, శ్రీ ప్రహ్లాదవరద స్వాములను భక్తులు దర్శించుకున్నారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1.633 అడుగులు
ప్రస్తుతం	:1.614.82
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:47.991
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:9.832

కష్టాలు కనుమరుగు



కొలిమిగుండ్ల మండలం తుమ్మలపెంటలో నిర్మించిన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులు, సిబ్బంది కనీస అవసరాలను గత ప్రభుత్వాలు విస్మరించాయి. మహిళా ఉద్యోగులది చెప్పుకోలేని పరిస్థితి. అత్యవసర సమయాల్లో స్థానికుల ఇళ్లలోకి వెళ్లాల్సి వచ్చేది. ఎన్నో ఏళ్లుగా ఇదే పరిస్థితి. ఈ కష్టాలు కనుమరుగు అయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టింది. ఆయా సచివాలయాల పరిధిలో శౌచాలయాల పనులు చకచకా సాగుతున్నాయి.

- వడివడిగా కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణం
- 417 గ్రామ సచివాలయాల పరిధిలో శౌచాలయాలు
- రూ. 12.51 కోట్ల నిధులు విడుదల
- ఇప్పటికే 195 నిర్మాణాలు పూర్తి
- ప్రజల కనీస అవసర కష్టాలకు చెక్

కోవెలకుంట్ల: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామ సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తేవడంతో పాటు స్వచ్ఛతకూ పెద్దపీట వేసింది. వివిధ పనుల నిమిత్తం గ్రామ, వార్డు సచివాలయాలకు వచ్చే ప్రజలకు కనీస అవసరాలు తీర్చేందుకు చర్యలు చేపట్టింది. బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జనను నిరోధించేందుకు కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్(సీఎస్‌సీ) నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో 417 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా మొదటి విడతలో అన్ని సచివాలయాల పరిధిలో శౌచాలయాల నిర్మాణానికి రూ. 12.51 కోట్ల నిధులు కేటాయించింది. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో వీటిని నిర్మిస్తున్నారు. జిల్లాలోని ఆయా మండలాల్లోని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకు 195 శౌచాలయాలు పూర్తి అయ్యాయి. ప్రతి రోజు వివిధ పనుల నిమిత్తం గ్రామ, వార్డు సచివాలయాలకు వచ్చే ప్రజల కనీస అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు గ్రామ సచివాలయ పరిధిలో రూ. 3 లక్షలతో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. మొదట్లో ఆయా గ్రామ పంచాయతీలు 10 శాతం నిధులు తమ వాటా చెల్లించాలని నిర్ణయించారు. అయితే అనేక చిన్న గ్రామ పంచాయతీలు తమ వాటా చెల్లించేందుకు ఆసక్తి చూపక పోవడంతో వందశాతం పనులు కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. జిల్లాలో బనగానపల్లె నియోజకవర్గంలో 78, డోన్‌లో 64, నందికొట్కూరులో 72, ఆళ్లగడ్డలో 81, నంద్యాలలో 35, శ్రీశైలంలో 54, పాణ్యం నియోజకవర్గంలో 33 సీఎస్‌సీలు మంజూరు కాగా ఆయా నియోజకవర్గాల్లో 195 పూర్తి అయ్యాయి. ఒక్కో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లో విద్యుత్, నీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పురుషులు, మహిళలకు వేర్వేరుగా యూరినల్స్, మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో మిగిలిన 222 సీఎస్‌సీల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖను తప్పించి మిగిలిన పనులు పూర్తి చేసే బాధ్యత ఏపీఈడబ్ల్యూ ఐడీసీ శాఖకు అప్పగించారు. ఈ శాఖ ఆధ్వర్యంలో ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో పనులు జరుగుతున్నాయి.



కోవెలకుంట్ల మండలం చిన్నకొప్పెర్లలో అన్ని వసతులతో నిర్మించిన శౌచాలయం

నియోజకవర్గాల వారీగా సీఎస్‌సీల వివరాలు

నియోజకవర్గం	సీఎస్‌సీలు	నిధులు
బనగానపల్లె	78	రూ.2.34 కోట్లు
ఆళ్లగడ్డ	81	రూ.2.43 కోట్లు
డోన్	64	రూ.1.92 కోట్లు
నందికొట్కూరు	72	రూ.2.16 కోట్లు
నంద్యాల	35	రూ.1.05 కోట్లు
శ్రీశైలం	54	రూ.1.62 కోట్లు
పాణ్యం	33	రూ. 99 లక్షలు

అత్యవసరం తీరేలా..

పల్లెల్లో గ్రామ సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి రావడంతో పలు సంక్షేమ పథకాలను మహిళల పేరున వర్తింపజేస్తున్నారు. దీంతో పురుషులతో పాటు మహిళలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. అలాగే ఒక్కో గ్రామ సచివాలయంలో పది మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. సిబ్బందితోపాటు అక్కడికి వచ్చే ప్రజల సౌకర్యార్థం టాయిలెట్స్, యూరినల్స్ అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడేవారు. మహిళలకు మరింత ఇబ్బందికరంగా ఉండేది. ఈ కష్టాలను గమనించి ప్రభుత్వం ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ను వేగంగా ఏర్పాటు చేస్తోంది.

సమస్యను పరిష్కరించారు



గ్రామ సచివాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే మహిళలకు కనీస అవసరాల సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టింది. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో మరుగుదొడ్డి, బాత్‌రూం వసతి కల్పించడం మంచి పరిణామం. మహిళల బాధలను అర్థం చేసుకున్న ప్రభుత్వం కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు నిర్మిస్తోంది.

– మీనాకుమారి, గ్రామ వలంటీర్, కోవెలకుంట్ల

సీఎస్‌సీలు ఉపయోగకరం



జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నిర్మిస్తున్న కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారుతాయి. గతంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్తే అక్కడ మరుగుదొడ్లు ఉండేవి కావు. ఇప్పుడు ప్రతి పనికి సచివాలయానికి వెళ్లాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల్లో అక్కడ శౌచాలయాలను నిర్మించడం ఎంతో మేలు. – ప్రతాప్‌రెడ్డి, కోవెలకుంట్ల

త్వరితగతిన నిర్మిస్తాం



కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లను త్వరితగతిన నిర్మించి అందుబాటులోకి తెస్తాం. కొలిమిగుండ్ల మండలం 16 గ్రామ సచివాలయాలు ఉండగా సీఎస్‌సీల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 48 లక్షలు మంజూరు చేసింది. ఇప్పటి వరకు ఎనిమిది పూర్తి అయ్యాయి. మిగిలినవి ఏపీఈడబ్ల్యూ ఐడీసీ శాఖ ఆధ్వర్యంలో చేపడతారు.

– సుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, కొలిమిగుండ్ల

న్యూస్‌రీల్

నేడు స్పందన

నంద్యాల: స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరించే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా యథాతదంగా స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు.

వైభవంగా బోనాల సమర్పణ



బోనాలతో వస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో కుందూనది ఒడ్డున వెలసిన శ్రీ జంబులాపరమేశ్వరిదేవి తిరునాల సందర్భంగా రెండవ రోజు ఆదివారం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రత్యేక పాత్రలో అమ్మవారికి ప్రీతి కరమైన నైవేద్యాన్ని తయారు చేసుకుని తప్పెట్లు, మేళతాళాలతో ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అమ్మవారు వెండి చీరలో భక్తులకు దర్శనమిచ్చారు.

మహిళల భద్రతకు పెద్దపీట



త్రీటౌన్ స్టేషన్‌లోని ఉమెన్ హెల్ప్ డెస్క్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ రమణ

బొమ్మలసత్రం: రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు పెద్దపీట వేసిందని అడిషనల్ ఎస్పీ రమణ అన్నారు. ఆదివారం పట్టణంలోని పోలీస్టేషన్లలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉమెన్స్ హెల్ప్ డెస్క్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతే ధ్యేయంగా ప్రభుత్వం దిశ యాప్, ఉమెన్ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసిందన్నారు. మహిళలు ఇచ్చిన ఫిర్యాదులను తప్పకుండా రిజిస్టర్ చేయాలని సిబ్బందిని సూచించామన్నారు. మహిళల అత్యవసర ఫిర్యాదులకు పోలీసులు తక్షణమే స్పందించాలని హెచ్చరించామన్నారు. అడిషనల్ ఎస్పీ వెంట దిశ సీఐ మధుసూదన్‌రెడ్డి, త్రీటౌన్ సీఐ నరసింహులు తదితరులు ఉన్నారు.

వైభవంగా శ్రీశైలగిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో పౌర్ణమిని పురస్కరించుకుని వైభవంగా శ్రీశైలగిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం సాయంత్రం సంప్రదాయబద్ధంగా శ్రీ స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి గిరిప్రదక్షిణ ప్రారంభించారు. శ్రీశైల మహాక్షేత్రంలో గిరిప్రదక్షిణ చేయడం ఎంతో ఫలప్రదమని పండితులు చెప్పారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం
- ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట
- సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తాం
- ఏపీజీఈఎఫ్ చైర్మన్ వెంకటరామిరెడ్డి



ర్యాలీలో పాల్గొన్న ఏపీజీఈఎఫ్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి, తదితరులు



ర్యాలీకి భారీగా హాజరైన ఉద్యోగులు

నంద్యాల(అర్బన్): ప్రజలకు పారదర్శకంగా సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి అన్నారు. స్థానిక టెక్కె మార్కెట్‌యార్డులో ఆదివారం ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ముందుగా పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏపీజీఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు రఘుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల్లోనే గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.30 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించిందన్నారు. సచివాలయ వ్యవస్థలో వలంటీర్ల నియామకం ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందుతున్నాయన్నారు. వీఆర్‌ఓలను సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించేందుకు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 1వ తేదీనే ఆప్కాస్ ద్వారా వేతనాలు ఇవ్వడం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉందని, ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో 6 వేలతో విధులు నిర్వహించిన ఆరోగ్యమిత్రలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.15 వేలు చేసి ఆదుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారి సంక్షేమానికి మరిన్ని చర్యలు చేపడుతుందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న జనరంజకమైన పాలన దేశంలో ఎక్కడా లేదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ పూర్తి చేయాలని, ఎంప్లాయీస్ హెల్త్ స్కీంకు ప్యాకేజీ పెంచాలంటూ ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. 010 కింద గ్రంథాలయ ఉద్యోగులకు జీతాలు వచ్చేలా ముఖ్యమంత్రిని ఒప్పిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సమస్యలన్నింటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందన్నారు. విద్యా, వైద్యానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతను ఇస్తుందనడానికి నాడు-నేడు పనులే నిదర్శనమన్నారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిని దాటాయన్నారు. గ్రామస్థాయిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటుతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఏపీ డీఎస్సీ తరహాలోనే 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు త్వరలోనే ఉద్యోగాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈనెల 8న కేబినెట్ సమావేశంలో 98 క్వాలిఫైడ్‌లకు సంబంధించిన ఫైల్‌కు ఆమోదం లభించే అవకాశం ఉందన్నారు. ఏపీజీఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవపాల్ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. సంఘాల పేరుతో నాయకులు ఉద్యోగులను తప్పుదోవ పట్టించవద్దన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఏపీ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీల అప్‌గ్రేడేషన్, పీఎస్‌ల ప్రమోషన్, గ్రేడ్ 5, 6ల నోషనల్ ఇంక్రిమెంట్ల మంజూరుకు కృషి చేయాలని కోరారు.

సభ విజయవంతం..

ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏపీజీఈఎఫ్,) ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నంద్యాలలో నిర్వహించిన భారీ ర్యాలీ, బహిరంగ సభ విజయవంతమైంది. 76 సంఘాలకు చెందిన ప్రతినిధులు, ఉద్యోగులు, పెన్షనర్లు భారీగా తరలి వచ్చారు. శ్రీనివాస సెంటర్ నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సచివాలయ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు దాదాపు 4వేల మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. డ్రమ్స్ వాయిద్యాలతో నాగులకుంట రోడ్డు మారుమోగింది. ట్రాఫిక్‌ను మళ్లించడంతో ర్యాలీ ప్రశాంతంగా టెక్కె మార్కెట్‌యార్డుకు చేరుకుంది. సభకు ఊహించిన దానికంటే ఉద్యోగు లు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఏపీజీఈఎఫ్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డికి పలువురు ఉద్యోగులు తమ సమస్యలు వివరించి ఫొటోలు దిగారు. సభ విజయవంతం కావడంతో నిర్వాహకుల్లో ఆనందం వ్యక్తమైంది. సమావేశంలో నాయకులు దయాకర్, సుబ్బారెడ్డి, భాస్కరరెడ్డి, అప్పిరెడ్డి, జ్యోతి, నాగరాజు, నిమ్మకాయల సుధాకర్, పిచ్చిరెడ్డి, రఘుబాబు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో నంద్యాల జిల్లా ప్రథమం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీలో నంద్యాల జిల్లా మొదటి స్థానం, కర్నూలు జిల్లా రెండో స్థానంలో నిలిచాయి. కర్నూలు జిల్లాలో 2,39,934 మంది లబ్ధిదారులు ఉండగా 2,37,914 (99.16 శాతం) మందికి, నంద్యాల జిల్లాలో 2,17,785 మంది లబ్ధిదారులు ఉండగా 2,16,117 (99.23 శాతం) మందికి పింఛన్లు అందజేశారు.

త్వరలో ఖాళీగా ఉన్న సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖాళీగా ఉన్న గ్రామ సర్పంచ్, వార్డు స్థానాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని కౌతాళం మండలం బదినేహాల్ సర్పంచ్ స్థానంతో పాటు వివిధ గ్రామాల్లోని 36 వార్డులకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. అలాగే నంద్యాల జిల్లాలో అవుకు మండలం అన్నవరం, ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు, కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లె గ్రామ పంచాయతీ సర్పంచులతో పాటు వివిధ గ్రామాల్లోని 40 వార్డులకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 27వ తేదీలోగా ఎలక్ట్రోల్ రోల్స్‌ను సిద్ధం చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి కర్నూలు జిల్లాలోని ఏడు మండలాల్లో తొమ్మిది, నంద్యాల జిల్లాలోని రెండు మండలాల్లో మూడు ఎంపీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ స్థానాలకు సంబంధించి మార్చి 2వ తేదీ నాటికి ఎలక్ట్రోల్ రోల్స్‌ను సిద్ధం చేయాలన్నారు.

అఖిలప్రియవి చీటింగ్ రాజకీయాలు

- రైతునగరంలో మాకున్నది 30 ఎకరాలే
- ఎప్పుడో భూములు కొంటే ఇన్‌సైడ్ ట్రేడింగ్ ఎలా అవుతుంది?
- నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పారవి, చిత్రంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తదితరులు

నంద్యాల: మాజీ మంత్రి భూమా అఖిలప్రియ చీటింగ్ రాజకీయాలు చేస్తున్నారని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి మండిపడ్డారు. ప్రజలకు ఉపయోగపడే పనులు, సమస్యల గురించి మాట్లాడకుండా రాజకీయ లబ్ధి కోసం అవాస్తవాలు మాట్లాడడం తగదని హెచ్చరించారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని తన గృహంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే శిల్పా రవి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతునగరంలో శిల్పా మోహన్‌రెడ్డి 50 ఎకరాలు భూములు కొనుగోలు చేసి ఇన్‌సైడ్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారని అఖిలప్రియ ఆరోపిస్తున్నారని, ఇదంతా అవాస్తవమన్నారు. అక్కడ తమకున్నది కేవలం 30 ఎకరాలేనని, అది కూడా ఒకే చోట లేదన్నారు. తన తండ్రి ఎమ్మెల్యే కాక ముందు అక్కడ భూములు కొనుగోలు చేశారని, 2001లో రిజిస్ట్రేషన్ జరిగిందని తెలిపారు. అక్కడ బైపాస్ రోడ్డు 2008లో వచ్చిందని, ఇది ఎలా ఇన్‌సైడ్ ట్రేడింగ్ అవుతుందని ప్రశ్నించారు. అమరావతి భూముల్లో టీడీపీ నాయకులు ఇన్‌సైడ్ ట్రేడింగ్ చేసి అందరిపై అదే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఆళ్లగడ్డలో భూమా అఖిల ప్రియ తండ్రి భూమానాగిరెడ్డి, టీడీపీ నేత ఏవీ సుబ్బారెడ్డి 200 ఎకరాలు కొనుగోలు చేశారని, వాటి ధర ఇప్పుడు ఎంత ఉందో అందరికీ తెలుసునని, అది కూడా ఇన్‌సైడ్ ట్రేడింగ్ చేసినట్లేనని పేర్కొన్నారు. శోభానాగిరెడ్డి ఆర్టీసీ చైర్మన్‌గా ఉన్నప్పుడు ఆళ్లగడ్డ బస్టాండ్‌ను వారి భూముల్లోకి మార్చుకోవడాన్ని ఏమంటారని ప్రశ్నించారు. 2004 ఎన్నికలు కేవలం బస్టాండ్ మార్పుపైనే జరిగాయని, ఆ ఎన్నికల్లో ప్రజలు ఏ విధంగా తీర్పు ఇచ్చారో అందరికీ తెలుసు అన్నారు. భూములకు ధర రావడానికి ఆర్‌ఏఆర్ఎస్‌లో నంద్యాల మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నారని చెప్పడం అవివేకమన్నారు. మెడికల్ కాలేజీ నంద్యాల ప్రజల దశాబ్దాల కోరిక అని, అది నెరవేరుతుంటే ఓర్చుకోలేకపోతున్నారన్నారు. నంద్యాల చుట్టు పక్కల 18 గ్రామాల్లోనూ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌గా మారుస్తున్నారని ఆరోపించిన నాయకులు ఆ గ్రామాల పేర్లు కూడా చెప్పాలన్నారు. కేవలం డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్ మాత్రమే జరుగుతుందని, వారు కూడా ప్రజల అభిప్రాయాలు తీసుకుంటున్నారని, మేము కూడా రైతులకు నష్టం జరగకుండా నంద్యాల పట్టణ సమీపంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏర్పాటు వద్దని, వేరే చోటికి మార్చాలని చెప్పామన్నారు.

శిల్పా సహకార్‌పై ఆరోపణలు తగదు

నంద్యాల పట్టణంలోని మార్కెట్‌యార్డుకు చెందిన 20 షాపులు తక్కువ ధరలకు అద్దెకు తీసుకున్నారంటూ ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. 1987 నుంచి 2010 వరకు షాపులు అద్దెకు పోగా ఖాళీగా ఉన్నాయని, అప్పుడు మీరేం చేస్తున్నారని ప్రశ్నించారు. శిల్పా సహకార్‌ను ఏర్పాటు చేసినప్పటి నుంచే తెల్ల రేషన్ కార్డు దారులకు 10 శాతం రాయితీతో నిత్యావసర సరుకులు అందిస్తున్నామన్నారు. శిల్పా మహిళా బ్యాంకు ఏర్పాటు చేసి మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తుంటే జీర్ణించుకోలేక నిందలు వేయడం తగదన్నారు. రెండేళ్లలో విజయ డెయిరీ ఆదాయం రూ.30కోట్లు చూపించామని, అందులో రూ.10 కోట్లు రైతులకు బోనస్ ఇచ్చామన్నారు. వారు 20 ఏళ్లు విజయ డెయిరీని గుప్పిట్లో ఉంచుకుని ఒక్క రూపాయి అయినా ఆదాయం చూపించలేదన్నారు.

అల్లర్లు సృష్టించేందుకు కుట్ర

అల్లర్లు సృష్టించాలనే లక్ష్యంతో నంద్యాల గాంధీ చౌక్‌కు వస్తా.. చర్చకు రా.. అంటూ అఖిల ప్రియ సవాల్ విసిరారన్నారు. నంద్యాల ప్రశాంతతకు మారు పేరు అని, ఫ్యాక్షన్, అల్లర్లు, చీటింగ్ రాజకీయాలు చేసే వారిని నంద్యాల ప్రజలు ఎప్పుడు ఆమోదించరన్నారు. ''రూ.200 కోట్లు ఇస్తా మీ ఆస్తులన్ని ఇవ్వండి అని చెబుతున్నారు.. మీ డబ్బులు మాకెందుకు.. మీకు డబ్బులు ఎక్కువైతే మీ ఇంటి ముందు వచ్చి ధర్నాలు, నిరసనలు తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులకు, మీ బంధువులకు ఇవ్వాలి'' అని హితవు పలికారు. అలాగే విజయ డెయిరీకి అప్పు ఉన్న రూ.1.45 కోట్లు చెల్లించాలన్నారు. బ్యాంకులో తనఖా ఉన్న ఆస్తులు అమ్ముకున్నారని, ఇప్పుడు బ్యాంకు అధికారులు అప్పు కట్టమని ఆమె ఇంటి చుట్టూ తిరుగుతున్నారన్నారు. 'ఇప్పటికే బంధువర్గం దూరమైంది, వచ్చే ఎన్నికల్లో టికెట్ రాదని కూడా చెబుతున్నారు.. మొదట నీ పరిస్థితులు చక్కదిద్దుకున్న తర్వాత రాజకీయాలు చేయి' అని హితవు పలికారు.

లోకేష్‌ది పాదయాత్ర కాదు.. టీడీపీ రాజకీయ ఊరేగింపు

- ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్

శ్రీశైలంటెంపుల్: లోకేష్ చేస్తున్న యాత్ర పాదయాత్ర కాదని, తెలుగుదేశంపార్టీ రాజకీయ ఊరేగింపు అని గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ విమర్శించారు. ఆదివారం శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను ఎమ్మెల్సీ దర్శించుకున్నారు. ఆలయం వెలుపల ఎమ్మెల్సీ మీడియాతో మాట్లాడుతూ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీతో ఇకపై సంబంధాలు ఏమి లేవన్నారు. కోటంరెడ్డి మాట్లాడుతున్న మాటలన్నీ టీడీపీ మాటలేనని ఆయన విమర్శించారు. కోటంరెడ్డి ఆరోపిస్తున్న ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం కాలమే నిర్ణయిస్తుందన్నారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి టీడీపీతో ముందు నుంచే టచ్‌లో ఉన్నారన్నారు. లోకేష్ చేస్తున్న పాదయాత్రలో ఒక స్పష్టత కాని, పవిత్రతకానీ లేదని విమర్శించారు. దీనిపై ప్రజల్లో ఎలాంటి చర్చ జరగడం లేదనిపేర్కొన్నారు. ప్రజలతో మమేకం కాకుండా సాగుతున్న పాదయాత్ర టీడీపీ రాజకీయ ఊరేగింపులా ఉందన్నారు. లోకేష్ చేస్తున్న పాదయాత్ర ద్వారా సంక్షేమ పథకాలు పెంచుతారా? తగ్గిస్తారా? అనేది ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉందని అన్నారు. చంద్రబాబు వయస్సు పైబడి తన వారసత్వం కోసం చేస్తున్న పాదయాత్ర తప్ప, దీనికి దిశా నిర్దేశం లేదని విమర్శించారు.

కుటీర నిర్మాణ పథకానికి రూ. 5 లక్షల విరాళం



విరాళానికి సంబంధించిన చెక్కును ఈఓకు అందజేస్తున్న దాతలు

శ్రీశైలంటెంపుల్: భక్తుల వసతి సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం చేపట్టిన కుటీర నిర్మాణం పథకం కింద గణేశ సదనంలోని బి-బ్లాక్‌లోని ఒక గది నిర్మాణానికి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన బి.వినోదిని రూ.5 లక్షలను విరాళంగా అందజేశారు. ఆ విరాళాన్ని దేవస్థానం ఈఓ ఎస్. లవన్నకు చెక్ రూపంలో అందించారు. గతంలో కూడా వీరు గది నిర్మాణానికి రూ.5 లక్షలను అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందజేశారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయిలో నెహ్రూనగర్ వాసి ప్రతిభ


విజయదుర్గ

గోస్పాడు: మండలంలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన తాటిచెర్ల విజయదుర్గ జాతీయ స్థాయిలో ప్రతిభ చాటింది. మినిస్ట్రీ ఆఫ్ కల్చరల్ ఆధ్వర్యంలో ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా విజయదుర్గ పాడిన దేశభక్తి గీతానికి మొదటి స్థానం లభించింది. ఈ సందర్భంగా ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన యూనిటీ ఇన్ క్రియేటివిటీ అండర్ ఆజాదికా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో ఆమెకు మొదటి స్థానం కింద బహుమతిని, ప్రశంస పత్రాన్ని నిర్వాహకులు అందజేశారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన విజయదుర్గను నెహ్రూనగర్ గ్రామస్తులు అభినందించారు.

రక్తహీనతపై ఇంటింటి సర్వే

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పోషకాహార లోపం ఉన్న పిల్లలు, రక్తహీనత ఉన్న కౌమార బాలికలు, గర్భిణులకు సంబంధించిన వివరాల సేకరణకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బాలక్రిష్ణారెడ్డి చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ/ వార్డు సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిసెంట్లు, వార్డు వెల్ఫేర్ సెక్రటరీలు ఇంటింటి సర్వే నిర్వహించి తమకు అందించిన ప్రత్యేక యాప్‌లో వివరాలను నమోదు చేయాల్సి ఉందన్నారు. అలాగే పాఠశాలలు, కళాశాలల్లో డ్రాపౌట్ల సామాజిక – ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులకు సంబంధించిన వివరాలను కూడా నమోదు చేయాల్సి ఉందన్నారు. ఎస్‌డీజీ సర్వే చేసేందుకు గ్రామ/ వార్డు సచివాలయాల శాఖ లబ్ధిదారుల అవుట్ రీచ్ మొబైల్ అప్లికేషన్‌లో కొత్తగా సర్వే చేసేందుకు ఆప్షన్లు కూడా ఇవ్వనుందన్నారు. సర్వే సమయంలో ఆధార్ నంబర్, క్లస్టర్ ఐడీ, ఆర్‌సీహెచ్ ఐడీ (అవసరం ఉన్న చోట) తదితర వివరాలు నమోదు చేస్తూ ఈకేవైసీ తీసుకోవాల్సి ఉందన్నారు.

హోరాహోరీగా ఎస్పీఎల్ పోటీలు

- సత్తా చాటిన క్రీడాకారులు
- నేడు ఫైనల్ పోటీలు


నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు

SPL SAKSHI PREMIER LEAGUE


సాక్షి ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కర్నూలు (టౌన్): సాక్షి ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ పోటీలకు జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల జిల్లా స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. ఆదివారం కర్నూలు వైద్య కళాశాల క్రీడా మైదానంలో సెమీఫైనల్ పోటీలు ఉత్కంఠ భరితంగా జరిగాయి.

సీనియర్స్ విభాగంలో..

మొదటి సెమీఫైనల్ మ్యాచ్ రాయలసీమ యూనివర్సిటీ, కర్నూలు వైద్య కళాశాల జట్ల మధ్య జరిగింది. కర్నూలు వైద్య కళాశాల జట్టు మొదట బ్యాటింగ్ చేసి నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 77 పరుగులు చేసింది. ఆ తరువాత బ్యాటింగ్ బరిలో దిగిన రాయలసీమ యూనివర్సిటీ జట్టు ఒక వికెట్ నష్టానికి 78 పరుగులు చేసి విజయం సాధించి, ఫైనల్‌కు చేరుకుంది. జట్టులో గణేష్ 6 వికెట్లు తీసి విజయంలో కీలక పాత్ర పోషించాడు. రెండో మ్యాచ్ పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల, నంద్యాల శాంతిరామ్ ఫార్మసీ కళాశాల జట్ల మధ్య జరిగింది. శాంతిరామ్ కళాశాల జట్టు 8 ఓవర్లు ఆడి 55 పరుగులకే ఆలౌట్ అయ్యింది. అనంతరం పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల జట్టు 4 వికెట్ల నష్టానికి 56 పరుగులు చేసి విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది.

జూనియర్స్ విభాగంలో..

కోడుమూరు కేవీఆర్ కళాశాల, ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య సెమీ ఫైనల్ మ్యాచ్ జరిగింది. కేవీఆర్ కళాశాల జట్టు మొదట బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 10 ఓవర్లలో 102 పరుగులు చేసింది. జట్టులో బ్యాట్స్‌మెన్ భార్గవ్ 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 66 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఆ తరువాత బ్యాటింగ్‌కు దిగిన ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లు ఆడి 8 వికెట్ల నష్టానికి 86 పరుగులు చేసి ఓటమి చెందింది. నంద్యాల ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నంద్యాల ఆకాంక్ష జూనియర్ కళాశాల జట్టు జట్ల మధ్య సెమీఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో ఈఎస్‌ఈ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు 10 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసింది. బ్యాట్స్‌మెన్ అనిల్ అత్యధికంగా 44 పరుగులు చేశాడు. ఆ తరువాత బ్యాటింగ్‌కు దిగిన ఆకాంక్ష జూనియర్ కళాశాల జట్టు దూకుడు ప్రదర్శించినా విజయాన్ని అందుకోలేకపోయింది. 9 ఓవర్లు ఆడి 67 పరుగులకు ఆలౌట్ అయ్యింది.

నేడు ఫైనల్ పోరు..

సీనియర్స్ విభాగంలో రాయలసీమ యూనివర్సిటీ, పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య సోమవారం ఫైనల్ పోరు జరగనుంది. అలాగే జూనియర్స్ విభాగంలో కోడుమూరు కేవీఆర్ జూనియర్ కళాశాల, నంద్యాల ఈఎస్‌సీ ప్రభుత్వ కళాశాల జట్ల మధ్య ఫైనల్ పోరు జరుగుతుంది.

SAKSHI MEDIA GROUP
సాక్షి
www.sakshi.com


గెలుపొందిన రాయలసీమ యూనివర్సిటీ జట్టు


పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల జట్టు


కోడుమూరు కేవీఆర్ కళాశాల జట్టు

డిస్ట్రిక్ట్ స్పాన్సర్
GPCET
Pioneering Innovative Education

నల్లమల ఘాట్‌లో లారీలు ఢీ


రోడ్డుకు అడ్డంగా లారీ బోల్తా పడటంతో నిలిచిన వాహనాలు

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్ రోడ్డులో రెండు లారీలు ఢీకొన్నాయి. ఆదివారం వరిధాన్యంతో గిద్దలూరు నుంచి నంద్యాల వైపు వస్తున్న లారీ అదే మార్గంలో ఎదురుగా వస్తున్న మరో ఐషర్ లారీని ప్రమాదవశాత్తూ ఢీకొంది. ఈ ఘటనలో వరిధాన్యం లారీ బోల్తా పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు రెండు గంటల పాటు వాహనాలు ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. ప్రమాద విషయం తెలుసుకున్న హైవే ఏఎస్‌ఐ కృష్ణుడు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అడ్డంగా పడి ఉన్న వాహనాన్ని పక్కకు తప్పించడంతో రాకపోకలు సాగాయి.

బంగారు ఆభరణాలు చోరీ

బనగానపల్లె రూరల్: కైప గ్రామంలో ఆదివారం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన జమ్మలమడుగు బాషా అనే వ్యక్తి తన కుమార్తె వివాహ నిమిత్తం ఆరు తులాల బంగారు ఆభరణాలు చేయించి ఇంట్లో పెట్టెలో ఉంచారు. ఆదివారం ఉదయం కుటుంబీకులందరూ ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు కిటికీ బండను పగులగొట్టి ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన వ్యక్తి

చిప్పగిరి: రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని బంటనహాల్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండగా స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టు నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి 40 సంవత్సరాలు ఉంటాయని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని వారు తెలిపారు.

ఆగిన బస్సును ఢీకొన్న కారు

వ్యక్తి దుర్మరణం.. ముగ్గురికి గాయాలు


మృతి చెందిన సిద్ధయ్య

ఆళ్లగడ్డ: చాగలమర్రి మండలం మద్దూరు మెట్ట సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాలకు చెందిన సిద్ధయ్య (42) మరో నలుగురు స్నేహితులతో కలిసి కారులో నంద్యాల నుంచి ప్రొద్దుటూరు వెళ్లి అక్కడ ఒక స్నేహితుడిని దింపి తిరిగి రాత్రి నంద్యాలకు బయలు దేరారు. ఈ క్రమంలో చాగలమర్రి దాటిన తరువాత మద్దూరు మెట్ట సమీపంలో మైదుకూరు నుంచి ఆళ్లగడ్డకు వస్తున్న బస్సు ఆగి ఉండటం గమనించక వెనుక నుంచి ఢీ కొట్టారు. ఈ సంఘటనలో సిద్ధయ్య అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవర్ శ్రీనివాసులు, శంకర్, శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన క్షతగాత్రులను నంద్యాల వైద్యశాలకు తరలించగా ఇందులో శంకర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు.


పుల్లగుమ్మిలో వివాహిత ఆత్మహత్య

వెల్దుర్తి: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుల్లగుమ్మి గ్రామంలో వివాహిత బెస్త రాణి(20) సూపర్ వాస్మాల్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. డోన్ మండలం గోసానిపల్లెకు చెందిన రాణికి 11 నెలల క్రితం పుల్లగుమ్మి రవితో వివాహం జరిగింది. ఆదివారం ఉదయం రాణి పుల్లగుమ్మిలోని తన ఇంట్లో సూపర్‌వాస్మాల్ తాగి అనారోగ్యానికి గురికావడం గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

నేటి నుంచి సోము వీర్రాజు పర్యటన

కర్నూలు కల్చరల్/పత్తికొండ రూరల్: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు సోమవారం నుంచి కర్నూలు జిల్లాలో పర్యటిస్తారని బీజేపీ నాయకులు తెలిపారు. పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి ఎన్. రాఘవేంద్రతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. మంగళవారం సోము వీర్రాజు పత్తికొండకు వస్తున్నట్లు ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగాగౌడు తెలిపారు.

కాలువలో పడి చిన్నారి మృతి


చిన్నారి సాయి కుమార్‌గౌడ్(4)

పెద్దకడబూరు: రాయలచెరువు నుంచి పారే నీటి కాలువలో పడి చిన్నారి సాయికుమార్‌గౌడ్(4) మృతి చెందిన ఘటన చిన్నతుంబళం గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. చిన్నారి తండ్రి రమేష్‌గౌడ్, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... సాయికుమార్‌గౌడ్ తోటి చిన్నారులతో ఆడుకుంటూ ఇంటికి పక్కనే ఉన్న కాలువలో పడిపోయాడు. గమనించిన స్థానికులు బయటకు తీయడానికి ప్రయత్నించేలోపు చిన్నారి మృతి చెందాడు. గతంలో ఇదే కాలువలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఇకపై ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లికుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

అన్నప్రసాద వితరణకు దాతల విరాళాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పలువురు దాతలు విరాళాలను అందజేశారు. వీరిలో కర్నూలుకు చెందిన వినోద్ కుమార్ రూ.లక్ష, ఢిల్లీకి చెందిన సీఆర్ సుబ్రహ్మణ్యం శర్మ రూ.1,00,116, పల్నాడుకు చెందిన కొత్త కోటేశ్వరరావు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని విరాళాల కేంద్రంలోని అధికారులకు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, విరాళానికి సంబంధించిన బాండును అందజేశారు.

ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతీసేందుకు కుట్ర

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతీయాలనే లక్ష్యంతో కొంతమంది ఉద్యోగ సంఘాల నేతలు పనికట్టుకొని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఏపీ ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం), మాజీ ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. అటువంటి వారికి ఉద్యోగులు దూరంగా ఉండాలని సూచించారు. ఆదివారం కర్నూలుకు వచ్చిన ఆయనకు స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా నేతలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ క్యాలెండర్‌ను ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను దశల వారీగా విడుదల చేయనుందని పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. ప్రొబేషన్ కూడా డిక్లేర్ చేయడంతో సచివాలయ ఉద్యోగుల్లో ఆనందం నెలకొందన్నారు. ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల అన్ని రకాల డిమాండ్‌లను ప్రభుత్వం త్వరలోనే పరిష్కరిస్తుందనే నమ్మకం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జవహర్‌లాల్, నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామకృష్ణారెడ్డి, ఇతర జిల్లా నాయకులు బలరామిరెడ్డి, సాంబశివారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వెటర్నరీ పారావెట్స్ ఉద్యోగుల సంఘం నేత వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాయలసీమ జోన్ టెన్నిస్ పోటీలు


విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నగర మాజీ అధ్యక్షుడు రాజావిష్ణువర్ధన్ రెడ్డి

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక జోహరాపురం రోడ్డులో ఉన్న మైపర్ టెన్నిస్ అకాడమీలో రెండు రోజులుగా థెరిసమ్మ జ్ఞాపకార్థం పేరుతో నిర్వహిస్తున్న రాయలసీమ జోన్ టెన్నిస్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. టోర్నమెంటు విజేతల వివరాలను మైపర్ టెన్నిస్ అకాడమీ చీఫ్ కోచ్ షేక్ మహమ్మద్ రఫీ వివరించారు. అండర్–16 బాలుర విభాగంలో శంకర్(విన్నర్‌గా), వచన్ (రన్నర్‌గా), అండర్–12 విభాగంలో శ్రీకర్ (విన్నర్), నిశాంత్(రన్నర్‌గా), బాలుర డబుల్స్ విభాగంలో క్రాంతి రెడ్డి, అరవింద్ (విన్నర్స్), శంకర్ పార్టనర్ కోచ్ రన్నర్స్‌గా వ్యవహరించారు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో వచన్, అర్షియా(విన్నర్స్‌గా), ఆదిమూలపు జాస్మిన్, సాయి శంకర్(రన్నర్స్‌గా), అండర్–14 విభాగంలో శంకర్ (విన్నర్స్), సందీప్ (రన్నర్), అండర్–12 బాలికల విభాగంలో భావన (విన్నర్, గిద్దలూరు), సమృద్ధి(రన్నర్‌గా) నిలిచారు. రాయలసీమ జోన్ టెన్నిస్ పోటీలకు స్పాన్సర్‌గా వ్యవహరించిన వైఎస్సార్‌సీపీ నగర మాజీ అధ్యక్షుడు రాజా విష్ణువర్ధన్ రెడ్డి అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలిచిన టెన్నిస్ క్రీడాకారులకు అభినందనలు తెలియజేస్తూ ఓడిన వారు మరింత ప్రయత్నం చేసి రేపటి గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మైపర్ టెన్నిస్ అకాడమీ మేనేజర్ రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కర్నూలును సేఫ్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్


పోలీస్ పెట్రోలింగ్ వాహనాలను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కర్నూలు (న్యూటౌన్): కర్నూలును సేఫ్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అన్నారు. ఆదివారం కొండారెడ్డి బురుజు వద్ద రూట్ మొబైల్స్ గస్తీ వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు న్యాయ రాజధాని కాబోతోందని, నగర పరిధి పెరిగిపోతుండడంతో ప్రజల్లో భద్రత భావాన్ని పెంపొందించేందుకు రాత్రి గస్తీని 8 సెక్టార్లుగా విభజించామన్నారు. రాత్రి పెట్రోలింగ్, గస్తీని పటిష్టం చేశారు. అత్యవసరమైతే తప్ప అర్ధరాత్రి వేళల్లో తిరగకూడదని యువతకు సూచించారు. బహిరంగంగా మద్యం సేవించే వారిపై, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై, అనుమానాస్పద వ్యక్తులపై పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎనిమిది సెక్టార్‌లలో ఆరుగురు ఎస్సైలు, ఇద్దరు సీఐలు, డీఎస్పీ స్థాయి అధికారులు రాత్రి గస్తీని పర్యవేక్షిస్తారని అన్నారు. కర్నూలు వన్‌టౌన్, టూ టౌన్, త్రీటౌన్, కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధుల్లో 40 రూట్ మొబైల్స్ గస్తీ వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 8 ఫోర్ వీలర్, 32 టు వీలర్ వాహనాలు ఉన్నాయన్నారు. గస్తీ పోలీసులు మద్యపానం సేవించిన 4,322 మందిని అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశారన్నారు. 31 మందిని డ్రంక్ అండ్ డ్రైవ్‌లో అదుపులోకి తీసుకున్నారన్నారు. 486 అనుమానితులను రాత్రిపూట గస్తీలో గుర్తించి పోలీస్ స్టేషన్‌లలో అప్పగించారన్నారు. రోడ్డు ప్రమాదాలు, అక్రమాలు, అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకునేందుకు చర్యలు చేపట్టామన్నారు. కర్నూలు నగరంలో 721 బృహస్పతి, 564 మ్యాట్రిక్స్ సీసీ కెమెరాలతో నిఘాను పటిష్టం చేశామన్నారు. కర్నూలు నగరంలో ఎక్కడైనా సమస్యలుంటే కర్నూ లు పోలీసు వెబ్ సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. 2023లో కర్నూలు నగరాన్ని పూర్తి సేఫ్ సిటీగా మార్చేందుకు చర్యలు చేపట్టామన్నారు.

ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర మహాసభలు విజయవంతం


చేతులు ఎత్తి సంఘీభావం తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నేతలు

కర్నూలు(సెంట్రల్): ఏపీ జేఏసీ అమరావతి (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులసేవా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ) మూడో రాష్ట్ర మహాసభలు విజయవంతమయ్యాయి. కర్నూలులోని జీఆర్‌సీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, కార్యదర్శి పలిశెట్టి దామోదర్ మాట్లాడారు. ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే సచివాలయ ఉద్యోగుల బదిలీలు చేపట్టాలన్నారు. జిల్లా అధ్యక్షుడు వి.గిరి కుమార్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి ఉద్యోగాసంఘాల నాయకులు తరలివచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ–చిట్యాల గ్రామాల మధ్య ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కోయిలకొండకు చెందిన బందికే అంజనకుమార్(36) మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. చిట్యాల గ్రామంలో జరిగిన తాత లాలు స్వామి ఉరుసుకు వెళ్లిన అంజనకుమార్ తిరిగి బైక్ (ఏపీ21ఏటీ2456)పై కోయిలకొండకు వస్తూ మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన అంజనకుమార్‌ను కుటుంబసభ్యులు వెంటనే డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి ఆటోలో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడు గ్రామంలోనే బైక్ మెకానిక్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతునికి భార్య మనోహరమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.